క్లుప్తంగా

స్వర్ణకుమారికి అభినందనలు



నూజివీడు: మార్షల్ ఆర్ట్స్‌లో భాగంగా సైక్లో ఫైట్‌లో జాతీయస్థాయిలో రజిత పతకం సాధించిన ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడుకు చెందిన రామకూరి స్వర్ణకుమారిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం అభినందించారు. నూజివీడులోని గురుకుల పాఠశాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న స్వర్ణకుమారి ఈ నెల 4నుంచి 6తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సైక్లో చాంపియన్ షిప్ పోటీల్లో 50 కిలోల లోపు అండర్–18 విభాగంలో ఈ ఘనతను సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకా ప్రతాప్ మాట్లాడుతూ మరింతగా రాణించి నూజివీడు కీర్తిని జాతీయ వేదికలపై చాటాలన్నారు. కళల్లో, క్రీడల్లో ప్రతిభ కలిగినవారిని ప్రభుత్వం ప్రోత్సహించడంతో పాటు తాను ఎల్లప్పుడూ తోడ్పాటును అందిస్తానన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో తిరువూరు విద్యార్థికి బంగారుపతకం



తిరువూరు: కాకినాడ జేఎన్‌టీ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కుంభా అజయ్ బంగారు పతకం గెలుచుకున్నాడు. ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న అజయ్ పవర్ లిఫ్టింగ్ 83 కిలోల విభాగంలో ప్రథమ స్థానం, 75 కిలోల శరీర దారుఢ్య విభాగంలో తృతీయ స్థానం పొందాడు. అజయ్‌ని ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, అధ్యాపకులు అభినందించారు.

వికసిత్ భారత సంకల్ప యాత్ర

చాట్రాయి: చాట్రాయిలో గురువారం వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎంపీడీఓ కె.దుర్గాప్రసాదు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, బీజేపీ నాయకులు గద్దం సంజీవరెడ్డి, రాజా, ద్రోణంరాజు వాసు, ఆదిమూలపు సురేష్ రాజా పాల్గొన్నారు.

క్రీస్తు సంఘం స్వర్ణోత్సవం



తిరువూరు: క్రీస్తు పరిచర్యలో 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న స్థానిక అశోక్‌నగర్లోని క్రీస్తు సంఘం స్వర్ణోత్సవం గురువారం జరిగింది. చర్చి ఫాదర్ ఇశ్రాయేలు, సువర్ణలత దంపతులను సంఘస్తులు సన్మానించారు. చర్చి పురోగతికి సహకరించిన వారికి ఫాదర్ ఇశ్రాయేలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఏసు క్రీస్తు ఆరాధన మహిమ గురించి వివరించారు.

రేపాకకు సాహిత్య అకాడమీ అభినందన



తిరువూరు: భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞా రచయిత పైడిమర్రి జీవితచరిత్రను తెలుగు, హిందీభాషల్లో రాసిన రచయితల సంఘ తిరువూరు ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్‌ను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అభినందించారు. ఏలూరు వైఎంహెచ్ఏలో జరిగిన సాహిత్య సంక్రాంతిలో తాను పైడిమర్రి పై రాసిన పుస్తకాన్ని, తపాలా శాఖ విడుదల చేసిన ప్రత్యేక పోస్టల్ కవరును శ్రీలక్ష్మికి అందజేశారు. రఘునందన్ కృషిని ఆమె అభినందించారు.

విద్యుత్ చౌర్యం.. సామాజిక నేరం

చాట్రాయి: విద్యుత్ చౌర్యం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. చాట్రాయిలో గురువారం నిర్వహించిన విద్యుత్ విజిలెన్స్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 44 బృందాలుగా ఏర్పడి 2,648 గృహాలు, 314 వాణిజ్య సముదాయాలను తనిఖీ చేయగా వాటిలో 217 సర్వీసులు అదనపు లోడు 341 కిలోవాట్ కింద రూ 7.70 లక్షలు జరిమానా విధించినట్లు చెప్పారు. అనుమతించిన కేటగిరి కాకుండా అనుమతించని వేరే కేటగిరిని వాడుచున్న వినియోగదారులపై రూ.40 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యం చేస్తున్న 8 మందిపై రూ.75 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

విస్సన్నపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు గురువారం ఉత్సాహంగా సాగాయి. వేమిరెడ్డిపల్లి టీం మండల స్థాయి పోటీల్లో విజేతగా నిలిచినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సురేష్, ఇన్‌చార్జి ఈఓ మురళి, పంచాయతీ కార్యదర్శులు రామారావు, ఆదినారాయణ, ఝాన్సీరాణి, వ్యాయమోపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో 676మంది క్రీడాకారులు

జి.కొండూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో రెండో రోజు గురువారం నిర్వహించిన క్రీడా పోటీల్లో 676మంది క్రీడాకారులు పోటీపడినట్లు ఎంపీడీఓ అనురాధ తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా మండల స్థాయిలో కబడ్డీలో జి.కొండూరు జట్టు, ఖోఖో పోటీల్లో వెలగలేరు జట్టు, షటిల్ బ్యాడ్మింటన్‌లో జి.కొండూరు జట్టు, వాలీబాల్ పోటీలలో వెల్లటూరు జట్టు ప్రథమస్థానంలో నిలిచాయని పేర్కొన్నారు. క్రికెట్ పోటీలు మరో రెండు రోజులు కొనసాగుతాయని తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు నియోజకవర్గ స్థాయిలో పోటీపడతాయని పేర్కొన్నారు.

మైలవరంలో..

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి స్టేడియం ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర పోటీలు ప్రారంభమయ్యాయి. మండల స్థాయిలో బుధవారం రాత్రి వరకు జరిగిన పోటీల్లో ఖోఖో పురుషుల విభాగం ఫైనల్స్‌లో మైలవరం 2 సచివాలయం ప్రథమ, పుల్లూరు 1 జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. మహిళల ఖోఖోలో మైలవరం 2 ప్రథమ స్థానం సాధించింది. మైలవరం 3 ద్వితీయ స్థానంలో నిలిచింది. వాలీబాల్ పురుషుల విభాగంలో కీర్తిరాయునిగూడెం, పొందుగల, పుల్లూరు 1, మైలవరం 2 సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. పురుషులు బ్యాడ్మింటన్‌లో మైలవరం 3 ఫైనల్‌కు చేరుకుంది. పురుషుల కబడ్డీలో వెల్వడం 2, చంద్రాల టీములు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి.

పోటాపోటీగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

చాట్రాయి: స్థానిక జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల క్రీడలు పోటాపోటీగా జరుగుతున్నాయి. గురువారం నాలుగు జట్ల మధ్య క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగాయి.

రసవత్తరంగా పోటీలు

ఏ.కొండూరు: స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయని ఎంపీడీఓ కేఎస్ రవికాంత్ పేర్కొన్నారు. ఈ ఆటల పోటీలను గురువారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో బాల్ బ్యాట్మింటన్ ఆటల పోటీల్లో 14 టీంలు పాల్గొన్నాయి. ప్రథమ స్థానం కంభంపాడు సచివాలయం, రెండో స్థానం కుమ్మరికుంట్ల సచివాలయం సాధించినట్లు ఎంపీడీఓ తెలిపారు.



వాలీబాల్ పోటీల్లో మండల స్థాయి విజేత టీంతో ఎంపీడీఓ వెంకటరమణ, అధికారులు



జి.కొండూరులో కబడ్డీలో పోటీపడుతున్న క్రీడాకారులు



చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలోని డీఏఆర్ కళాశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, షటిల్, ఖోఖో పోటీలను పీడీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో భాగంగా గురువారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో అన్నవరం జట్టు పాతరావిచర్ల జట్టుపై విజయం సాధించింది. పట్టణంలోని నెహ్రూపేట, పాతపేట–2 మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో పాతపేట–2 జట్టు గెలుపొందింది. వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్ర, నాగేశ్వరరావు, వనజ, లక్ష్మి, సరళ, స్వప్న, రాణి, రాజేశ్వరి, పుల్లారావు, ఆదర్శ, నాగమణి పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటండి

ఆగిరిపల్లి: ఆడుదాం ఆంధ్రా పోటీలతో గ్రామీణ క్రీడాకారుల సత్తా వెలుగులోకి వస్తుందని స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ రాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ శంకరరావు, అడవినెక్కలం సర్పంచ్ వేము రాజు, పంచాయతీ కార్యదర్శులు బొల్లగానీ ప్రసాద్, సంగామయ్య, పుల్లారావు, పీఈటీ నాగేంద్ర పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. 21 సచివాలయం స్థాయి నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో ఎంపికైన టీముల మధ్య మండల స్థాయి పోటీలను నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో పెనుగొలను, ఖోఖో పోటీలో నెమలి, వాలీబాల్లో పెద్ద కొమిర టీములు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలినట్లు తిరువూరు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గుర్రం గోపాలరావు తెలిపారు.

ముసునూరులో..

ముసునూరు: స్థానిక హైస్కూల్లో ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పీడీలు ఆలీ, సుకుమార్, నాగమల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు జరగుతున్నాయి. షటిల్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో చెక్కపల్లి, చింతలవల్లి టీమ్‌లు తలపడగా చెక్కపల్లి జట్టు విజేతగా నిలిచిందని ఎంపీడీఓ తెలిపారు. ఖోఖో ఫైనల్స్‌లో ముసునూరు–1, చింతలవల్లి జట్లు హోరాహోరీ తలపడగా ముసునూరు–1 జట్టు విజేతగా నిలిచినట్లు పేర్కొన్నారు.



నూజివీడులో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గెలుపొందిన అన్నవరం జట్టు



ఆగిరిపల్లిలో క్రికెట్ పోటీలు ప్రారంభించిన స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ రాజు



గంపలగూడెం మండల స్థాయిలో ఖోఖో విజేత నెమలి టీం

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు



గోదాదేవి అమ్మవారికి నైవేద్యం

గంపలగూడెం: మండలంలోని పలు సీతారామచంద్రస్వామి ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు 27వ రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. గంపలగూడెం రామచంద్ర స్వామి ఆలయంలో అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. గోదాదేవి అమ్మవారికి 108 వెండి గంగాళాలు, 108 స్టీలు గంగాళాలలో పాయసాన్నం ఉంచి కూడారై ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. గంపలగూడెం భజన మందిరం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాల్లో కూడా ధనుర్మాస ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో తెల్లవారుజామున మహిళలు తిరుప్పావై పాశురాల పఠనం చేశారు.



తిరువూరు రంగనాయకస్వామి ఆలయంలో మాల మార్పిడి ఉత్సవం

భక్తిశ్రద్ధలతో మాల మార్పిడి ఉత్సవం

తిరువూరు: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక రంగనాయక స్వామి ఆలయంలో గురువారం మాల మార్పిడి ఉత్సవం జరిగింది. గత 26 రోజులుగా నిత్యం తిరుప్పావై పఠనం, ప్రత్యేక పూజాదికాలతో వైష్ణవ సంప్రదాయ ప్రకారం ధనుర్మాసోత్సవాలను నిర్వహించారు. శుక్రవారం 108 రకాల నైవేద్యాలను సమర్పించే కూడారై ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వెంకటాచలస్వామి దేవస్థానం, కోదండ రామాలయం, రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయాల్లో ధనుర్మాస విశేషపూజలు జరిగాయి.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో కూడారై

మధురానగర్(విజయవాడసెంట్రల్): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గురువారం శ్రీధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన స్వామి వారికి చందన అలంకారం చేశారు. స్వామికి తులసి అర్చన, పంచామృతాభిషేకం జరిగాయి. అలాగే కూడారై సందర్భంగా 108 లఘు గంగాళములతో స్వామికి పాయస నివేదన చేశారు. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నూజివీడు: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ముందు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను గురువారం చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతులు శుభ్రంగా లేకపోతే వాటికి ఉండే క్రిములు, బాక్టీరియా, వైరస్‌లు మనం తినే ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్తాయన్నారు. దీని వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా 80శాతం వ్యాధులను మన దరిచేరకుండా ఉంచవచ్చని వైద్యులు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం ఆనంద్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ

సంక్రాంతి సంబరాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు కొండపల్లి మున్సిపాల్టీ ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు బేబీ సరోజినీ, ఎల్ పార్వతీ బహుమతులు అందజేశారు. ఉపాధ్యక్షురాలు కరుణ, సభ్యులు పాల్గొన్నారు.

వికసిత్ భారత సంకల్ప యాత్రపై సమీక్ష

ఆగిరిపల్లి: ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న వికసిత్ భారత సంకల్ప యాత్రపై ప్రత్యేక అధికారి సత్యనారాయణ రాజు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. అధికారులు అందరూ తప్పకుండా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎంపీడీఓ శంకర రావు, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, మండల వ్యవసాయాధికారి చెన్నారావు, హౌసింగ్ ఏఈ అలిముల్లా, ఎంఈఓ కొవ్వలి ఆనంద్‌కుమార్, ఈఓపీఆర్డీ శేఖర్ పాల్గొన్నారు.

రైల్వే లైన్ ఏర్పాటుకు సర్వే చేయించాలి

నూజివీడు: నూజివీడు పట్టణానికి రైల్వే లైన్ ఏర్పాటుకు సర్వే జరిపించాలని అఖిలపక్ష ఐక్యవేదిక గురువారం డిమాండ్ చేసింది. ఈ విషయమై ఇప్పటికే బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకి మెమోరాండం ఇవ్వగా, ఆయన రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి రైల్వే లైనుకు సర్వే చేయాలని విజ్ఞప్తి చేసినట్లుగా ఐక్యవేదిక నాయకులు గోగినేని శ్రీనివాస అప్పారావు (బీజేపీ), సామాజిక కార్యకర్తలు చాట్రాతి రామకృష్ణ, జి హనుమంతరావు, లోకాల ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. దానికి వారు సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులకు సర్వే పనులు ప్రారంభించాలని ఆదేశించారన్నారు. నూజివీడు మామిడి పంటకు ప్రసిద్ధని, ఇక్కడ నుంచి మామిడి ఎగుమతులు ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి పట్టణాలకు జరుగుతాయన్నారు. అలాగే నూజివీడు పట్టణం బందరు పోర్టు రోడ్డుకు అనుసంధానించబడి ఉందని, బందరు పోర్టు నిర్మాణం పూర్తయితే బందరు నుంచి ఎగుమతులు, దిగుమతులు తెలంగాణ రాష్ట్రానికి, ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ వరకు ఈ రోడ్డు మార్గంగానే జరుగుతాయని, గన్నవరం పక్కన నూజివీడుకు సమీపంలో మల్లవల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక కారిడార్‌ను అనుసంధానిస్తూ ఈ రైల్వేలైన్ నిర్మాణం జరగాలని వారు కోరారు.

మౌంటవీర్ మోతీనాయక్‌కు అభినందన



తిరువూరు: ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎత్తయిన కిలిమంజారో, యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తయిన శిఖరం మౌంట్ ఎల్బ్రస్‌ను అధిరోహించిన ఖమ్మం జిల్లా మౌంటవీర్ మోతీనాయక్‌ను జనవిజ్ఞాన వేదిక సభ్యులు తిరువూరులో గురువారం అభినందించారు. దేశానికి ఖ్యాతి తెచ్చిన మోతీనాయక్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆయనకు సాయం చేయాలని జేవీవీ ప్రతినిధి రాంప్రదీప్ కోరారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

చాట్రాయి: సంక్రాంతిని పురస్కరించుకుని పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్వామి హెచ్చరించారు. గురువారం పాత నేరస్తులకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. గతంలో పేకాట, కోడి పందేలు నిర్వహించిన 100 మంది, గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన 30 మందిని తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పేదల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంకు చెందిన తాళ్లూరి వేణుగోపాలస్వామికి కిడ్నీల మార్పిడి శస్త్రచికిత్స చేయాల్సి రాగా, నిరుపేద కుటుంబం కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధి సాయం కొరకు దరఖాస్తు చేసుకోగా, ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు కృషితో ప్రభుత్వం రూ.6 లక్షలకు ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్)ను మంజూరు చేసింది. దీంతో ఈ ఎల్‌వోసీని వేణుగోపాలస్వామి భార్యకు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో 3వేలకు పైగా వ్యాధులను చేర్చిన ప్రభుత్వం అందులో వర్తించని వ్యాధులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సీఎం జగన్ సాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సుంకొల్లు సర్పంచి దుడ్డు నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేపల్లి రాంబాబు పాల్గొన్నారు.



ప్రభుత్వం మంజూరు చేసిన ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

మామిడి రైతులు యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి

నూజివీడు: మామిడి తోటల్లో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు ఉద్యాన అధికారులు, మామిడి శాస్త్రవేత్తలు అందించే సూచనలు, సలహాలను రైతులు పాటించాలని నూజివీడు మామిడి పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి అన్నారు. మండలంలోని బోర్వంచ, రావిచర్లలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పూత, పిందె వచ్చు దశల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. తోటల్లో ఉన్న తేనెమంచుపురుగు, తామర పురుగు, పండు ఈగ నివారణకు తగిన నివారణ చర్యలను చేపట్టాలన్నారు. తేనెమంచు పురుగు నివారణకు వేపనూనె 1500 పీపీఎం 3ఎంఎల్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రాములు లేదా క్లోరోఫైరిఫాస్ 20ఈసీ 2.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. తామర పురుగుల ఉధృతి అధికంగా ఉంటే స్పైనోసాడ్ 0.25ఎంఎల్ లేదా థయోమిథాక్షమ్ 0.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2ఎంఎల్ ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పండు ఈగ నివారణకు మామిడి తోటల్లో ఎర బుట్టలను ఏర్పాటు చేసుకుంటే సమర్థవంతంగా అరికట్టవచ్చని సూచించారు. మామిడితోటల్లో పూమొగ్గలపైన, రెమ్మలపైన పక్షికన్ను తెగులును గమనిస్తే కార్బండిజమ్ 1గ్రాము లేదా ఎం–45 2గ్రాములు లేదా క్లోరోథాలోనిల్ 1గ్రాము చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మామిడి శాస్త్రవేత్త కే రాధారాణి, ఉద్యాన సహాయ సంచాలకులు జే శాంతి, ఉద్యాన అధికారి రాజులపాటి హేమ, గ్రామ ఉద్యాన సహాయకులు జయలక్ష్మి, ప్రవీణ్ పాల్గొన్నారు.



బోర్వంచలో మామిడి తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి, తదితరులు

ఉన్నత ఆశయాలతో భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి

మైలవరం: విద్యార్థులు ఉన్నత ఆశయాలతో తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కూల్ ల్యాబ్ కార్యక్రమం జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌కు చెందిన హైస్కూల్ ప్లస్ విద్యార్థులు రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి. ఫణికుమార్ ఆధ్వర్యంలో రసాయన ప్రయోగాలలో శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులు ఫిబ్రవరిలో జరిగే ప్రయోగశాల పరీక్షలకు తర్ఫీదు పొందినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత తీసుకోవాల్సిన నిర్ణయంపై వారి భవిష్యత్ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.



స్కూల్ టు ల్యాబ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

సరిహద్దు చెక్‌పోస్టుల ఏర్పాటు



తిరువూరులో చెక్‌పోస్టు పరిశీలిస్తున్న ఏసీపీ

తిరువూరు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తిరువూరు సమీపంలోని తెలంగాణ సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ రమేష్ తెలిపారు. ఆయన తిరువూరు సర్కిల్లోని పలు చెక్‌పోస్టులను గురువారం తనిఖీ చేశారు. అక్రమ మద్యం, నగదు రవాణా అరికట్టేందుకు ఈ చెక్‌పోస్టులను పటిష్ఠంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. తిరువూరు అష్టలక్ష్మి ఆలయం వద్ద, గంపలగూడెం మండలం రాజవరం, విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి, మైలవరం మండలం మొర్సుమిల్లి, జీకొండూరు మండలం గంగినేని వద్ద ఈ చెక్‌పోస్టులను నిర్వహిస్తున్నట్లు ఏసీపీ విలేకరులకు తెలిపారు. ఇప్పటివరకు ఈ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలలో రూ.14లక్షల నగదు ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని పేర్కొన్నారు. 294 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశామని తెలిపారు. సారా, బెల్లపు ఊట అక్రమంగా తరలిస్తున్న వారిపై 34 కేసులు నమోదు చేసి 1945 లీటర్ల సారా స్వాధీన పరచుకున్నామన్నారు. 35,300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని తెలిపారు. తిరువూరు సీఐ నబీ, ఎస్ఐలు సతీష్, పద్మారావు పాల్గొన్నారు.